ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్
నలుగురు మావోయిస్టులు హతం

2లో..

సంపుటి: 1 | సంచిక: 324 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 28 ఫిబ్రవరి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

అమల్లోకి 2 కొత్త స్కీమ్స్

రూ.500కే సిలిండర్.. 200 యూనిట్లలోపు ఫ్రీ కరెంటు
ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఫ్రీ కరెంటు పథకాలను అధికారికంగా ప్రారంభించారు. తెలంగాణ సచివాలయం ఇందుకు వేదిక అయింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ వల్ల ప్రియాంక గాంధీ తెలంగాణ పర్యటన రద్దు అయిందని తెలిపారు. అందుకే చేవెళ్లలో ప్రారంభించాలనుకున్న మరో రెండు గ్యారంటీల కార్యక్రమాన్ని సచివాలయానికి మార్చామని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం (ఫిబ్రవరి 27) విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇక్కడే అభయహస్తం గ్యారంటీల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి గ్యారంటీల్లో మరో రెండు పథకాలను ప్రారంభించారు. ఈ వేదికపై నుంచి ఐదుగురు లబ్ధిదారులకు రూ.500 కే సిలిండర్ ను రేవంత్ రెడ్డి అందించారు. తాము ఇచ్చిన గ్యారెంటీలను నమ్మి ప్రజలు తమకు ఓటు వేశారని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే

..మిగతా 2లో

లక్ష కోట్ల పెట్టుబడులు..
5 లక్షల ఉద్యోగాలు
300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్-2

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ నగరంలో త్వరలోనే జీనోమ్ వ్యాలీ రెండవ ఫేజ్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైటెక్స్ లో హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ బయో ఏషియా 2024 సదస్సును ప్రారంభించిన సీఎం ఈ ఏడాది జీనోమ్ వ్యాలీ ఎక్సెలెన్స్ 2024 అవార్డుకు ఎంపికైన నోబెల్ బహుమతి గ్రహిత ప్రొఫెసర్ గ్రెగ్ ఎల్.సెమెంజాను అభినందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ..మూడు వందల ఎకరాల్లో రూ.2000 కోట్ల పెట్టుబడులతో జీనోమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తామనీ, లక్ష కోట్ల పెట్టుబడులతో పది ఫార్మా విలేజీలను ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే మొదలైందని తెలిపారు. ఈ వ్యాలీతో మౌలిక సదుపాయాలతో పాటు ఔత్సహిక పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయనీ, అలాగే.. 5 లక్షల మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా సెక్టార్లలో ఈ ఫార్మా విలేజ్ లను ఏర్పాటు చేస్తామనీ, హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఒక గంట ప్రయాణ దూరంలోని అత్యంత సమీపంలో వీటిని ఏర్పాటు చేస్తున్నందున ప్రపంచంలోని పారిశ్రామికవేత్తలందరికీ ఎంతో సదుపాయంగా ఉంటుందని అన్నారు. కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనలున్న పరిస్థితుల్లో

..మిగతా 2లో

వారంలో మెగా డీఎస్సీ
11 వేల ఖాళీలతో 'మెగా డీఎస్సీ' నోటిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి 'మెగా డీఎస్సీ' నోటిఫికేషన్ విడుదల చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. అన్ని అనుకూలిస్తే.. ఈ వారంలోనే డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. మెగా డీఎస్సీ ద్వారా దాదాపు 11,060 పోస్టులు భర్తీ చేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా డీఎస్సీకి సంబంధించిన నివేదికను విద్యాశాఖ సిద్ధం చేసి సీఎం

..మిగతా 2లో

గగన్‌యాన్ మిషన్ ద్వారా రోదసిలోకి
భారత్ మానవసహిత తొలి అంతరిక్ష ప్రయోగం
నలుగురు వ్యోమగాముల పేర్లను ప్రకటించిన ప్రధాని మోదీ

తిరువనంతపురం, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం): మానవ అంతరిక్ష యాత్ర గగన్ యాన్' కోసం శిక్షణ పొందుతున్న నలుగురు పైలట్ల పేర్లను ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ప్రకటించారు. పైలట్లు గ్రూప్ కెప్టెన్ పి బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ ఎస్ శుక్లా గా అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా నలుగురు వ్యోమగాములను ప్రధాని అభినందించారు. ఈ రోజు ఈ వ్యోమగాములను కలుసుకుని దేశం ముందు

..మిగతా 2లో

తెలంగాణ నుంచి
రాహుల్ పోటీ?

వయనాడును వదులుకున్న రాహుల్ గాంధీ.. ఖమ్మం, భువనగిరి, నల్గొండ నుంచి పోటీకి ఛాన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం): తెలంగాణలో మరింత బలం పెంచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఆ పార్టీ అగ్రనేతలను తెలంగాణ నుంచి పోలీ చేయించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే రాష్ట్రంలో సర్కార్ ఎప్పటి చేసిన కాంగ్రెస్ వచ్చే లోక్ సభ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలను గెలుచుకోవాలన్న పట్టుదలతో ఉంది. ఈ క్రమంలోనే అభ్యర్థుల ఎంపికపై అచితూచి అడుగులు వస్తోంది. ఇప్పటికే మెజార్టీ స్థానాలకు అభ్యర్థుల విషయంలో ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రం నుంచి పార్టీ అధినేతలను రంగంలో దింపాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే రాహుల్ గాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తే.. ఇక్కడ పార్టీ మరింత ప్రభావం

..మిగతా 2లో

డ్రగ్ పార్టీలో డైరెక్టర్ క్రిష్
మాదాపూర్ డీసీపీ వినీత్ కుమార్ వెల్లడి
కొకైన్ తీసుకున్నాడా లేదా? తేలాల్సి ఉంది

గచ్చిబౌలి, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం): గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో శనివారం రాత్రి జరిగిన డ్రగ్ పార్టీలో ప్రముఖ సినీ దర్శకుడు క్రిష్ పాల్గొన్నట్లు మాదాపూర్ డీసీపీ వినీత్ కుమార్ తెలిపారు. అయితే కొకైన్ వాడారా? లేదా? అనేది తెలియాల్సి ఉందన్నారు. ఈ పార్టీ కోసం డ్రగ్ సరఫరా చేసిన (పెడ్లర్) సయ్యద్ అబ్బాస్ అలీ జెఫ్రీని అరెస్టు చేశామని చెప్పారు. రాడిసన్ హోటల్‌లో గజ్జల వివేకానంద్‌కు 10 సార్లు మాదకద్రవ్యాలు సప్లయ్ చేసినట్లుగా అబ్బాస్ తన వాంగ్మూలంలో పేర్కొన్నాడని వివరించారు. చాలాసార్లు డ్రగ్ పార్టీలు చేసుకున్నట్లు చెప్పాడని మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ డీసీపీ తెలిపారు. క్రిష్ రెండురోజుల్లో విచారణకు వస్తారని, ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని డీసీపీ చెప్పారు. వివేకానంద్‌ను కలిసేందుకు మాత్రమే వచ్చినట్లు క్రిష్ చెబుతున్నాడని, వైద్య పరీక్షలు చేస్తేనే స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు. కేదార్, నిర్భయ్ అనే కామన్ ఫ్రెండ్స్ ద్వారా సినిమా వాళ్లు వివేకానంద్‌కు పరిచయం అయ్యి ఉండవచ్చని తెలిపారు. డ్రగ్‌కు బానిస కావడంతోనే తరచుగా పార్టీలు నిర్వహించి ఉండవచ్చని అన్నారు. డ్రగ్ హైదరాబాద్‌లోనే కొనుగోలు చేసినట్లు అబ్బాస్ చెబుతున్నాడని, అయితే ఎక్కడి నుంచి సరఫరా అయ్యిందో విచారణలో తేలుతుందని చెప్పారు. కొకైన్ సరఫరా చేసిన ప్రతిసారీ రెండు నుంచి నాలుగు గ్రాములు వివేకానంద్‌కు అందించాడన్నారు. వివేకానంద్ ఎంత మొత్తంలో డబ్బులు చెల్లించాడో త్వరలో చెబుతామని చెప్పారు. కేసులో అనుమానితులుగా ఉన్న శ్వేత, సందీప్‌లు పరారీలో ఉండగా బెంగళూరులో ఉన్న చరణ్ అక్కడే విచారణకు వస్తున్నట్లు తెలిపారు.

సంగారెడ్డి జిల్లాలో
ఘోర ప్రమాదం
లారీ ఢీకొని ముగ్గురు యువకులు మృతి

సంగారెడ్డి. ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం): సంగారెడ్డి జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో జోగిపేటకు చెందిన ఆరుగురు యువకులు కారులో చౌటకూర్ దాబాకు వెళ్లారు. అది మూసి ఉండడంతో అదే కారులో మాసన్ పల్లి వద్ద హైవే పక్కన ఉన్న హోటల్ లో టీ తాగారు. తిరిగి వెళ్తున్న క్రమంలో బ్రిడ్జి కింద కారు ఆపి కిందకు దిగగా అటుగా వచ్చిన టిప్పర్ లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆందోల్ మండలం డాకూర్ శివారులో ఈ ప్రమాదం

..మిగతా 2లో

వారంలో మెగా డీఎస్సీ

మొదటి పేజీ తరువాయి...

కార్యాలయానికి పంపింది. అక్కడి నుంచి అనుమతి రాగానే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే డీఎస్సీ నిర్వహణపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. మెగా డీఎస్సీ ద్వారా టీచరు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. టీచర్ల పదోన్నతులు, బదిలీల్లో ఇబ్బందులపై దృష్టిసారించాలని సీఎం సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు లేరనే సాకుతో మూసేసిన బడులను మళ్లీ తెరిపించాలని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఎంత మంది విద్యార్థులు ఉన్నా.. బడి నడవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలో బడి ఉండాల్సిందేనని అన్నారు. బడి లేని కారణంగా విద్యార్థులు చదువులకు దూరం కావొద్దని, చదువుల కోసం వేరు గ్రామాలు, పట్టణాలకు పోయే పరిస్థితులు ఉండొద్దని పేర్కొన్నారు. ఇందుకోసం మెగా డీఎస్సీ వేయాలని, అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం 5059 పోస్టులలో డీఎస్సీని విడుదల చేసిన సంగతి తెలిసిందే. విద్యాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ 1739, పండిట్ పోస్టులు 611, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు 164, ఎస్జీటీ పోస్టులు 2,575 పోస్టులున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చెప్పిన ప్రకారం 13 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అయినా ప్రభుత్వం వారి ఆవేదనను పట్టించుకోకుండా నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్ష తేదీలను కూడా ప్రకటించింది. అయితే ఎన్నికల కారణంగా అది వాయిదా పడింది. అయితే ఆ సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు గత నోటిఫికేషన్ ను రద్దు చేసి, 11 వేల టీచర్ పోస్టులతో నాలుగైదు రోజుల్లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు సమాచారం. ఈ నోటిఫికేషన్‌లోనే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం స్పెషల్ టీచర్లను రిక్రూట్ చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసింది. తుది ఫలితాలు వెల్లడికి అడ్డంకిగా మారిన కోర్టు కేసులు, ఇతర కారణాలను న్యాయనిపుణులతో చర్చించి పరిష్కరించింది. పోలీస్, గురుకుల, స్టాఫ్ నర్స్ వంటి పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించింది. గ్రూప్-1 కూడా హైకోర్టు తీర్పును అనుసరించి గత నోటిఫికేషన్‌ను రద్దు చేసి, ఎలాంటి కోర్టు కేసులు రాకుండా జాగ్రత్తలతో, పెంచిన పోస్టులతో కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్త నోటిఫికేషన్ వివాదరహితంగా ఉన్నదని పోటీ పరీక్షల నిపుణులు చెబుతున్నారు. కాబట్టి నిరుద్యోగ అభ్యర్థులు ఎవరైనా కోర్టు కేసులతో మళ్లీ ప్రక్రియ ఆగుతుందనే ప్రచారాన్ని విశ్వసించవద్దని, చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఇంటర్మీడియట్ గద్వాల జిల్లా విద్యాశాఖ అధికారి హృదయరాజ్

పరీక్షలు రాయనున్న 8,567 మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాలు.. ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)నేటి నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 28న ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలతో ప్రారంభమై మార్చి 19వరకు జరిగే పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, మోడల్, సోషల్ వెల్ఫేర్, మైనార్టీ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 8,567 మంది ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3,990 మంది ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాస్తుండగా 4,577 మంది విద్యార్థులు సెకండ్ ఇయర్ పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు 14 మందిని చీఫ్ సూపరింటెండెంట్లను, 14 మంది డిపార్టుమెంట్ అధికారులను నియమించారు. ఎలాంటి పొరపాట్లు, కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఒక సిట్టింగ్ స్క్వాడ్, పోలీసు, రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌ల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించింది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. పరీక్షా సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్‌ను అమలు చేయడంతోపాటు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను పరీక్ష ముగిసే వరకు మూసివేస్తారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

ఒక నిమిషం నిబంధన అమలులో ఉన్నందున విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో, ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలని గద్వాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హృదయరాజ్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 9160125322 నంబర్ కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

బీజాపూర్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం): ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా ఎన్‌కౌంటర్లు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇటీవలె భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో నలుగురు నక్సల్స్ మృతి చెందారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవలె కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు హతం అయినట్లు పోలీసులు ప్రకటించారు. అయితే అది ఫేక్ ఎన్‌కౌంటర్ అని.. అసలు చనిపోయిన వారు నక్సల్స్ కాదని వారి కుటుంబ సభ్యులు చెబుతుండటం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలోని చోటే తుంగాలి అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య చాలాసేపు ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకోవడంతో ఆ ప్రాంతంలో భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చేపట్టారు. ఆ ప్రాంతంలో ఇంకా ఎవరైనా మావోయిస్టులు దాగి ఉన్నారా అని సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఎలాంటి అనుమానాస్పద కదలికలు కనిపించినా వదలకుండా గాలిస్తున్నారు. చోటే తుంగాలి అటవీ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఉదయం 11 గంటలకు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలోనే జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు నక్సల్స్ కాల్పులు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నలుగురు మావోయిస్టులను మట్టుబెట్టినట్లు పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఘటనాస్థలం నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాలను కూడా గుర్తించినట్లు పేర్కొన్నారు. సోమవారం పోలీసులకు ఓ మావోయిస్టు లొంగిపోగా.. ఆ తర్వాతి రోజే ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకోవడం గమనార్హం. లొంగిపోయిన మావోయిస్ట్‌పై రూ.8 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. ఇక ఇటీవలె సుక్మా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒకరు చనిపోగా.. ఆ తర్వాత ఆదివారం కాంకేర్ జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో మరో ముగ్గురు హతమైనట్లు పోలీసులు వెల్లడించారు. బుర్కలంక అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, డీఆర్‌జీ జవాన్లకు మధ్య ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్ట్ చనిపోయాడు. ఆదివారం ఉదయం కాంకేర్ జిల్లాలోలోని కోయలిబేడా అటవీ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గారడ్స్ , బీఎస్ఎఫ్ జవాన్లు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. దీంతో ముగ్గురు మావోయిస్టులు మరణించారని జిల్లా ఎస్పీ ఇందిర కల్యాణ్ చెప్పారు. సంఘటనా స్థలంలో ముగ్గురి మృతదేహాలతోపాటు 2 తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అయితే ఈ ముగ్గురు మృతి చెందడంపై వారి కుటుంబ సభ్యులు మాత్రం వేరే వాదనను వినిపిస్తున్నారు. అసలు ఆ ముగ్గురు మావోయిస్టులే కాదని వారి కుటుంబాలు చెప్పడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలీసులు ఫేక్ ఎన్‌కౌంటర్ చేసి.. సామాన్యులను కాల్చి చంపి.. అది నక్సల్స్ ఏరివేత అని చెబుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. దీంతో అసలు వాళ్లు మావోయిస్టులా లేక సాధారణ పౌరులా అర్థం కావడం లేదు.

సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం

మొదటి పేజీ తరువాయి...

చోటు చేసుకుంది. ఘటనలో మరో యువకుడికి తీవ్ర గాయాలు కాగా.. ఇద్దరు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతులు వాజిద్, హాజీ, ముక్రమ్ గా గుర్తించారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరంతా జోగిపేటకు చెందిన వారేనని.. మెకానిక్స్ గా వర్క్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష కోట్ల పెట్టుబడులు.. 5 లక్షల ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి...

హైదరాబాద్ వేదికగా జరుగుతోన్న బయోఏషియా సదస్సు కీలకంగా మారిందని, బయోసైన్స్ రాజధానిగా హైదరాబాద్ నేడు యావత్ మానవాళికి ఒక భరోసాగా నిలిచిందని పేర్కొన్నారు. వైరస్ భయాలను ధీటుగా ఎదుర్కోగలమనే నమ్మకాన్ని హైదరాబాద్ కలిగించిందని, ఇప్పుడు ప్రపంచంలో వినియోగించే ప్రతి మూడు వ్యాక్సిన్లలో ఒకటి హైదరాబాద్ లోనే ఉత్పత్తి అవుతోందని గుర్తు చేశారు. ఆరోగ్య భద్రత విషయంలో ప్రపంచంలోని అందరి సమస్యలు ఒకేలా ఉన్నాయని కోవిడ్ నిరూపించిందని, అయితే సమస్యల పరిష్కారాలను కూడా మనం కలిసికట్టుగానే సాధించాలని సీఎం సూచించారు. ఒక్క బయోసైన్సెస్ లోనే కాదు, ఐటీ-సాఫ్ట్ వేర్, రీసెర్చ్, స్టార్టప్ రంగాలకు రాజధానిగా ఉన్న హైదరాబాద్ ను మరింత సమున్నతంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ, దేశీయ సంస్థలు ఇక్కడ ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన అనుకూల వ్యవస్థలను బలోపేతం చేశామన్నారు. చిన్న స్టార్టప్ లు, పెద్ద కార్పొరేట్ కంపెనీలకు వారధిగా నిలిచే ఎంఎస్ఎంఈ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ఇటీవల దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు భారీ స్థాయిలో రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. ఏటా 5కోట్ల డోసుల వ్యాక్సిన్ల ఉత్పత్తే లక్ష్యంగా ప్రఖ్యాత టకేడా సంస్థ ఇక్కడి బయోలాజికల్-ఈ సంస్థతో కలిసి హైదరాబాద్ లో తయారీ కేంద్రం నెలకొల్పడాన్ని స్వాగతించారు. వైరస్ ల వల్ల ప్రపంచంలో నెలకొన్న భయాలకు హైదరాబాద్ నుంచి నమ్మకాన్ని కల్పిస్తున్నామని సీఎం అన్నారు. జర్మనీకి చెందిన మిల్టేనీ సంస్థ తన రీసెర్చ్ సెంటర్ ను హైదరాబాద్ లో ఏర్పాటు చేసిందని చెప్పారు. మానవాళికి మంచి చేసే చర్చలు, ముందడుగుతో హైదరాబాద్ బయో ఏషియా సదస్సు విజయవంతం కావాలని సీఎం ఆకాంక్షించారు.

గగన్‌యాన్ మిషన్ ద్వారా రోదసిలోకి

మొదటి పేజీ తరువాయి...

ప్రదర్శించే అవకాశం లభించినందుకు సంతోషంగా ఉందన్నారు. యావత్ దేశం తరఫున వారిని అభినందిస్తున్నాను. నేటి భారతదేశానికి గర్వకారణం' అని ప్రధాని మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన విజయం దేశ యువతలో శాస్త్రీయ స్వభావానికి బీజం వేస్తోందన్నారు. కేరళలోని తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్సీ)ను సందర్శించిన ప్రధాని మోదీ అక్కడ గగన్యాన్ మిషన్ పురోగతిని సమీక్షించారు. ఆయన వెంట కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేంద్ర మంత్రి మురళీధరన్, ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ ఉన్నారు. గగన్ యాన్ మిషన్ భారతదేశం మొదటి మానవ సహిత అంతరిక్ష యాత్ర. ఇది 2024-2025 మధ్య ప్రయోగాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. మూడు రోజుల మిషన్ కోసం ముగ్గురు బృందాన్ని 400 కిలోమీటర్ల కక్ష్యలోకి ప్రవేశపెట్టి, భారత సముద్రంలోకి దిగడం ద్వారా వారిని సురక్షితంగా భూమికి తీసుకురావాలని ఈ ప్రాజెక్టు భావిస్తోంది. అంతర్గత నైపుణ్యం, భారతీయ పరిశ్రమల అనుభవం, భారతీయ విద్యారంగం, పరిశోధనా సంస్థల మేధో సామర్థ్యాలతో పాటు అంతర్జాతీయ సంస్థల వద్ద అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిగణనలోకి తీసుకొని సరైన వ్యూహం ద్వారా ఈ మిషన్ సాధించవచ్చని ఇస్రో ఒక ప్రకటనలో తెలిపింది. ఇక గగన్ యాన్ మిషన్ల కోసం మానవ-రేటింగ్ కలిగిన ఎల్వీఎం 3 లాంచ్ వెహికల్ క్రయోజెనిక్ దశకు శక్తినిచ్చే సిఇ 20 క్రయోజెనిక్ ఇంజిన్ మానవ రేటింగ్లో ఇస్రో ఒక పెద్ద మైలురాయిని సాధించింది.

అమల్లోకి 2 కొత్త స్కీమ్స్

మొదటి పేజీ తరువాయి...

రెండు గ్యారంటీలను అమలు చేసినట్లు రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పేదలు కట్టెల పొయ్యితో ఇబ్బందులు పడుతుంటే.. ఆనాడు యూపీఏ ప్రభుత్వమే దీపం పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ఇప్పుడు ఉన్న బీజేపీ ప్రభుత్వం సిలిండర్ ధరను రూ.1200 కు తీసుకెళ్లిందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిలిండర్ పై సబ్సిడీ ఇచ్చేందుకు ముందుకు రాలేదని.. తద్వారా వచ్చే పన్నుల ద్వారా లబ్ధి పొందాయని అన్నారు. తాజాగా తాము ఇచ్చిన హామీల్లో భాగంగా రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన పథకం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని.. నూటికి నూరు శాతం అన్ని హామీలను అమలు చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. తాము తెలంగాణ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని అన్నారు. అలాగే, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వాళ్లకే ఈ పథకాలు వర్తిస్తాయని మరోసారి రేవంత్ రెడ్డి చెప్పారు. పేదల ఇళ్లలో వెలుగులు నింపాలనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అన్నారు. అలాగే మహాలక్ష్మి పథకం కింద సబ్సిడీతో రూ.500 సిలిండర్ అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహాలక్ష్మిలో మరో హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం ఈ ఉదయమే జీవో జారీ చేసింది. గ్యాస్ కంపెనీలకు నెలవారీగా సబ్సిడీ చెల్లిస్తామని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బును గ్యాస్ కంపెనీలు బదిలీ చేయనున్నాయి. మూడేళ్ల సరాసరి వినియోగం ఆధారంగా సిలిండర్లు ఇవ్వనున్నారు. రేషన్ కార్డు ఉన్న వారికే ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే చెప్పిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.20 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. దాంట్లో వైట్ రేషన్ కార్డు దారులు ఉన్న కుటుంబాల సంఖ్య 89.99 లక్షలుగా ఉంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న తెల్ల రేషన్ కార్డుదారులకు రూ.500కే సిలిండర్ ఇవ్వనున్నారు.

తెలంగాణ నుంచి రాహుల్ పోటీ?

మొదటి పేజీ తరువాయి...

చూపుతుందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. లోక్ సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఈసారి కేరళకు గుడ్ బై చెప్పవచ్చు. కేరళలో రాహుల్ గాంధీ వయనాడ్ సీటుతో పాటు శశి థరూర్ తిరువనంతపురం సీటు నుంచి ఎల్డీఎఫ్ అభ్యర్థులను ప్రకటించింది. ఇలాంటి పరిస్థితుల్లో రాహుల్ గాంధీ ఈసారి వాయనాడ్ నుంచి ఎన్నికల్లో పోటీ చేయకూడదని భావిస్తున్నారు. అయితే రాహుల్ గాంధీ వాయనాడ్ నుంచి ఎన్నికల్లో పోటీ చేయడం లేదని గతంలో వచ్చాయి. రాహుల్ గాంధీ ఈసారి తెలంగాణతో పాటు యూపీలోని రాయ్‌బరేలీ లేదా అమేథీ నుంచి ఎన్నికల్లో పోటీ చేయవచ్చని తెలుస్తోంది. అయితే ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఇంకా స్పష్టత ఇవ్వలేదు. అమేథీలో స్మృతి ఇరానీపై పోటీ చేసే అంశంపై రాహుల్ గాంధీ కూడా ఏమీ మాట్లాడలేదు. మరోవైపు ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత రాహుల్ అమేథీపై అంతగా ఆసక్తి చూపలేదు. అదే సమయంలో వరుణ్ గాంధీ కూడా ఇక్కడి నుంచి పోటీ చేయవచ్చనే చర్చ కూడా సాగుతోంది. భారత కూటమిలో భాగమైన సీపీఐ (ఎం) కేరళలోని నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. విశేషమేమిటంటే ఆ నలుగురిలో రాహుల్ గాంధీకి చెందిన వాయనాడ్ సీటు, పార్టీ అధినేత శశిథరూర్ తిరువనంతపురం సీటు కూడా ఉన్నాయి. సీపీఐ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా భార్య, సీపీఐ సీనియర్ నేత అన్నీ రాజాను వాయనాడ్ నియోజకవర్గం నుంచి పోటీకి దింపింది. అయితే, కేరళలో సీట్ల పంపకానికి సంబంధించి భారత కూటమి నుంచి ఇంకా ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ఇంతలో అభ్యర్థులను ప్రకటించడం కూడా xఇండియాx కూటమిలో చీలికగా ఏర్పడినట్లు కనిపిస్తోంది. అదే సమయంలో కాంగ్రెస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు వామపక్షాలు వ్యూహరచన చేస్తున్నాయని రాజకీయ నిపుణులు అంటున్నారు. అయితే గత కొంతకాలంగా సోనియా లేదా రాహుల్ తెలంగాణ నుంచి పోటీ చేస్తే పార్టీకి మరింత మంచి ఫలితాలు వస్తాయంటూ టీపీసీసీ నేతలు చెప్తూ వస్తున్నారు. సోనియా పోటీ చేయాలని తీర్మానం కూడా చేశారు. అయితే.. ఆమె పెద్దల సభకు వెళ్లడంతో రాహుల్ గాంధీని పోటీ చేయించాలని చూస్తోంది తెలంగాణ కాంగ్రెస్ పార్టీ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. అంతా రాహుల్‌గాంధీ రావాలనే కోరుతున్నారు. మరోవైపు, కర్నాటక నుంచి కూడా ఇలాంటి ప్రతిపాదనే వస్తోంది. ఢిల్లీ పెద్దలు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై త్వరలో స్పష్టత రానుంది. అటు.. రెండో చోట పోటీ చేయాలని భావిస్తే.. మళ్లీ అమేథీ నుంచి బరిలో ఉండే ఛాన్స్ ఉందంటున్నారు.

సిలిండర్ పేలి దగ్ధమైన ఇల్లు

గ్యాస్ సిలిండర్ లీకై వ్యాపించిన మంటలు

బుగ్గి పాలైన చేనేత మగ్గాలు

బాధితులను పరామర్శించిన జడ్ పి చైర్మన్ సరిత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)గ్యాస్ సిలిండర్ లీకై సామగ్రి, చేనేత మగ్గం దగ్ధమైన ఘటన గద్వాల నియోజకవర్గంలోని తప్పెట్లమొర్సు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గట్టు మండలం తప్పెట్లమొర్సు గ్రామానికి చెందిన తలారి బజారన్న శివమాల ధరించారు. ఇరుముడి సందర్భంగా మంగళవారం ఇంట్లో కుటుంబ సభ్యులు వంట చేస్తుండగా సిలిండర్ నుంచి గ్యాస్ లీకై... మంటలు వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు యత్నించే క్రమంలో ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఇంట్లో ఉన్న చేనేత మగ్గం, నిత్యావసర సరుకులు, దగ్ధమయ్యాయి. గ్యాస్ సిలిండర్ పేలకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స కోసం గద్వాల ఆసుపత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలను ఆర్పేశారు. విషయం తెలుసుకున్న జెడ్ పి చైర్పన్ సరిత సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించి, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బాధితులను పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ బాబు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, తిరుమల్, వేణుగోపాల్, ముక్కెరన్న, గద్వాల తిమ్మప్ప, నరసింహులు, మహ్మద్ అలీ, బాలకృష్ణ, తిమ్మప్ప, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న జెడ్ పి చైర్మన్ సరిత

మహాశివరాత్రి మహోత్సవాలకు శాసన సభ్యులను ఆహ్వానించిన కోటిలింగేశ్వర ఆలయ కమిటి

కొత్తకోట, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానములో వైభవంగా జరిగే పవిత్రమైన మహాశివరాత్రి మహోత్సవాలకు దేవరకద్ర, వనపర్తి శాసనసభ్యులు జిఎంఆర్, మేఘా రెడ్డిలను ఆలయ ప్రధానకార్యదర్శి రుమాళ్ళశేఖర్ కమిటీ ప్రతినిధుల తో కలిసి ఆహ్వానించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీకోటిలింగేశ్వరస్వామి%శ్రీ%ని దర్శించుకొని అభిషేకం చేసుకోవాలని శాసనసభ్యులను కోరారు. అందుకు ఎమ్మెల్యే లు జిఎంఆర్, మెఘా రెడ్డిలు మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయప్రధానకార్యదర్శి రుమాళ్ళశేఖర్, ఆలయ అర్చకులు రుమాళ్ళజగధీశ్వర్ , జంగం జగదీష్ స్వామి , అనిల్ స్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేఘారెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ను శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ

మార్చ్ 5న రాజేంద్రనగర్ జర్నలిస్టుల క్రికెట్ మ్యాచ్

క్రికెట్ కిట్ బహుకరించిన ఈ టీవీ సీనియర్ జర్నలిస్ట్ మిద్దెల బుజంగరెడ్డి

మ్యాచ్ సందర్భంగా సహకరించడానికి ముందుకు వచ్చిన పలువురు జర్నలిస్టుల

క్రికెట్ కిట్ ను టీమ్ కు బహుకరిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ మిద్దెల బుజంగరెడ్డి

క్రికెట్ మ్యాచ్ లోగోను ఆవిష్కరిస్తున్న రాజేంద్రనగర్ జర్నలిస్టులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం): క్రీడలు సోదర భావాన్ని పెంపొందిస్తాయని సీనియర్ జర్నలిస్టులు మిద్దెల భుజంగరెడ్డి, అప్పారెడ్డిగూడెం భీమయ్య, మేకల దామోదర్ రెడ్డి, ఎం బాల సుబ్రమణ్యంలు అన్నారు. రాజేంద్రనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ సందర్భంగా మంగళవారం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఈటీవీ సీనియర్ జర్నలిస్టు మిద్దెల భుజంగరెడ్డి తన సొంత నిధులతో క్రికెట్ కిట్టు బహుకరించి టీమ్ కు అందచేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు మిద్దెల బుజంగరెడ్డి, అప్పారెడ్డిగూడెం భీమయ్య, మేకల దామోదర్ రెడ్డి, ఎం.బాలసుబ్రమణ్యంలు మాట్లాడుతూ.... జర్నలిస్టులు నిత్యం ఎంతో బిజీగా ఉంటూ ప్రజల శ్రేయస్సు కోసం వార్తలు సేకరిస్తూ ఉంటారన్నారు. అందరిని ఏకతాటిపైకి తీసుకు వచ్చి క్రికెట్ పోటీలు నిర్వహించడం వారిని ఉత్తేజపరచడం కోసమే అన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమని, గెలుపును స్ఫూర్తిగా తీసుకుని క్రీడలలో ముందుకు వెళ్లాలన్నారు. ఈ టోర్నమెంట్ నిర్వహణలో జర్నలిస్ట్ క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్ట్ గద్దె యాదగిరి భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారని, మేకల దామోదర్ రెడ్డి టీ షర్ట్ లు బహుకరిస్తున్నారని, ఎం. ప్రేమ్ రాజ్ కూల్ డ్రింక్స్, దస్తగిరి మంచినీటి సౌకర్యం, కరుణాకర్ క్యాప్స్ కోసం సహకారం, సౌండ్ సిస్టం రాజు, ఫోటోగ్రఫీ శ్రీకాంత్, గణేష్, బహుమతులు బి. బాబురావు లు ఇవ్వడానికి ముందుకు రావడం సంతోష కరమైన విషయం అన్నారు. క్రికెట్ పోటీల కు క్యాప్టెన్ లుగా మేకల దామోదర్ రెడ్డి, పి. సూర్య కిరణ్, ఎ. సుజీవన్ రెడ్డి, ఎస్. విజయ్ కుమార్ లు వ్యవహరిస్తున్నారన్నారు. క్రికెట్ పోటీల నిర్వాహణ కన్వీనర్ గా యూ. శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి గా పి. సూర్య కిరణ్, ప్రశాంత్ రెడ్డి, సుజీవన్ రెడ్డి, దస్తగిరి, ఎం. ప్రేమ్ రాజ్ లు నిర్వాహకులు గా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రాన్ మీడియా ప్రతినిధులు ఎస్. మనోహర్, వర్కాల చందు, పి. శివచరణ్ గౌడ్, అనిల్ కుమార్, కోట్ల చంద్రకాంత్,ఎ. తిరుమలేష్, ఎం. బలమురళీకృష్ణ, నర్సింహా, లక్ష్మణ్, కోరని మహేష్, రామకృష్ణ, డి. ఇంద్రసేన, శ్యామ్, కరుణాకర్ సాగర్, పవన్ భారతి, అజార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటిస్తున్న ఏరువ కుమారస్వామి

చంద్రశేఖర్ ఆజాద్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ఏరువ కుమారస్వామి

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం) స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ ఆశయాల కోసం నేటి యువత ముందుకు సాగాలని నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏరువా కుమారస్వామి అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ బాబుల్ రెడ్డి నగర్ నవ యువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ... సహాయ నిరాకరణోద్యమం"లో తన 15 వ యేటనే చురుగ్గా పాల్గొన్న ఆజాద్‌ని బ్రిటిష్ వారు నిర్బంధించి కోర్టులో ప్రవేశ పెట్టారు. మేజిస్ట్రేట్ ప్రశ్నకు బదులుగా తన పేరు 'ఆజాద్' (స్వేచ్ఛ), తండ్రి పేరు 'స్వాతంత్రం' అని, తాను నివసించేదిజైల్లో అని నిర్భయంగా చెప్పాడు అన్నారు . ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి క్లబ్ సభ్యులు నరేష్ సాగర్, మల్లేష్, కార్తీక్, గోపాల్, అంగన్వాడీ టీచర్ కనకవ్వ పాల్గొన్నారు

క్రమబద్ధీకరణపై రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

దేపల్లె సుజాత మల్లేష్ గౌడ్

సుజాత మల్లేష్ గౌడ్

శంషాబాద్, ఫిబ్రవరి 27, (ప్రభాత ఉదయం) ఎల్ ఆర్ ఎస్ స్కీంను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల శంషాబాద్ మండలం ఘాన్సీమియా గూడ గ్రామపంచాయతీ మాజీ సభ్యురాలు దేపల్లె సుజాత మల్లేష్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అర్థరహితమైన నిర్ణయం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది చిన్న వ్యాపారులు ప్లాట్లు ఖరీదు చేసిన వాళ్ళు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతో సముచితమైనదని హర్షం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ లేఔట్లలో ప్లాట్లు ఖరీదు చేసిన వారు అనేక మంది గత మూడు సంవత్సరాలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులను మానసిక వత్తులను ఎదుర్కొన్నారని తెలిపారు. గ్రామపంచాయతీ లేఔట్లను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన లక్షలాదిమందికి ఎంతో మేలు జరుగుతుందని సుజాత మల్లేష్ గౌడ్ అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల లక్షలాది కుటుంబాలకు మేలు జరుగుతుందని ఆ కుటుంబాలు ఎంతో సంతోషంగా ఫీల్ అవుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకున్నప్పుడు నోరు మెదపని హరీష్ రావు ఇప్పుడు ఆ స్కీమును ఉచితంగా అమలు చేయాలని పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఊరటనిచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.

శంషాబాద్ ఏసీపీ శ్రీనివాసరావును కలిసిన రాచమల్ల సురేష్

శంషాబాద్ నూతన ఏసిపికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్ సురేష్ కుమార్

శంషాబాద్, ఫిబ్రవరి 27, (ప్రభాత ఉదయం) శంషాబాద్ ఏసీపీ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాచమల్ల సురేష్ మంగళవారం కలిశారు. ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ఎప్పుడు తాము సహకరిస్తామని ఆయన తెలిపారు.

స్త్రీ శక్తి అత్యంత శక్తివంతమైంది

అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అపోలో హాస్పిటల్స్ జాయింట్ డైరెక్టర్ సంగీతారెడ్డి

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం): స్త్రీ శక్తి అన్ని శక్తులలో అత్యంత శక్తివంతమైనదని, ఈ శక్తి ఇంటిని, సమాజాన్ని, రాష్ట్రాన్ని, దేశాన్ని, ప్రపంచాన్ని మార్చగలదని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి తెలిపారు. రాజేంద్ర నగర్‌లోని సన్ సిటీలోని కేకే కన్వెన్షన్‌లో మహిళా శక్తి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. మహిళలు నాయకత్వం వహించే చోట ఫలితాలు స్థిరంగా, సానుకూలంగా ఉంటాయన్నారు. ఇవి మానవాళికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని చెప్పారు. ఇంట్లో మహిళలు ఉల్లాసంగా ఉంటే, ఆ ఉత్సహం కుటుంబం అంతా ఉంటుందన్నారు. ఆ శ్రేయస్సు, వివేకం భౌతిక సంపదను మించిన సంపద అవుతుందన్నారు. గత ఏడాది భారతదేశం జీ 20 సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చిందన్నారు. జీ20 అతి ముఖ్యమైన అంశం జీ20 ఎంపవర్ అని, ఇది మహిళలపై దృష్టి సారించిందని తెలిపారు. జీ20 దేశాలలో మహిళా సాధికారత సమూహాలు ఉన్నాయని చెప్పారు. మహిళా శ్రామిక శక్తిని మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యమన్నారు. మొదటి సమావేశంలో మహిళలు ఇంటి వద్ద లేదా కార్యాలయంలో దాదాపు 24/7 ఎక్కువ భాగం పనిలో ఉంటారన్న వాస్తవాన్ని చెప్పానన్నారు. కష్టపడి పనిచేసే మహిళలను ఆదుకోవడం సమాజం బాధ్యత అన్నారు. ప్రస్తుతం మహిళలు కార్యాలయంలో కేవలం 23 శాతం మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. 5 శాతం కంటే తక్కువ మహిళా సీఈవోలు ఉన్నారన్నారు. పురుషులు, మహిళలు చేసే ఒకే పనికి కూడా స్త్రీకి తక్కువ వేతనం లభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివక్షతను అధిగమించడానికి మహిళలకు సమాన అవకాశాలు, సరసమైన పని వాతావరణం కోసం మద్దతు, ప్రోత్సాహం అవసరమని తెలిపారు.

నేడు శ్రీ విద్యానికేతన్ హై స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

బుద్వేల్, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవుపల్లి డివిజన్ బాబుల్ రెడ్డి నగర్ లో గల శ్రీ విద్యానికేతన్ హై స్కూల్ లో ఈనెల 28వ తేదీన సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ బోయ లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు. స్కెరీ రూమ్, స్పేస్ రూమ్, నేచర్ రూమ్, ఆర్ట్ గ్యాలరీ తదితర ప్రదర్శనలు ఉంటాయన్నారు. విద్యార్థుల ఆలోచనల ద్వారా రూపొందించబడిన అనేక ప్రదర్శనలు విద్యార్థుల ను ఆలోచింప చేయనున్నాయన్నారు. ఉదయం 10 గంటలకు సైన్స్ ఫెయిర్ ప్రారంభ మౌతుందన్నారు.

బోయ లక్ష్మణ్

కబ్జాకు గురైన చెరువును పరిశీలిస్తున్న కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్

చెరువులు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్

కబ్జాదారులపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తాం

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం) కూకట్‌పల్లి నియోజకవర్గంలోని చెరువులు గత పాలకుల భూ దాహానికి బలై కబ్జాకు గురై అన్యాక్రాంత మవుతున్నాయని, బఫర్ జోన్, ఎఫ్ టి ఎల్ లలో, నాలాలను కబ్జా చేసి స్థిర నివాసాలు ఏర్పర్చడం వలన భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని భూగర్భ జలాలు సంరక్షించుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులకు ఉందని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్, పార్టీ సీనియర్ నాయకులు గొట్టముక్కల వెంకటేశ్వర్ అన్నారు. ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లోని బోయిన్ చెరువును మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులతో కలిసి వారు పరిశీలించారు .అక్కడి చెరువు కబ్జా చేయడం గమనించి, మండల రెవెన్యూ సర్వేయర్ తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు, ఈ చెరువుకు సంబందించిన కబ్జా గురించి సమగ్రమైన రిపోర్ట్ అందించాలని అధికారులను ఆదేశించారు. కబ్జాల్లో వున్నావారు ఎవరైనా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను ఆదేశించారు. ఇక ముందు ఎవరైనా కబ్జా కు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమం లో డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

బాల్ బ్యాట్మింటన్ క్రీడాకారులతో వర్సిటీ పాలకమండలి సభ్యులు, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డాక్టర్ సి నరేందర్ రెడ్డి, డాక్టర్ బి విద్యాసాగర్ తదితరులు

షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న మహిళా అధ్యాపకులు

క్యారమ్స్ ఆడుతున్న సల్లా సౌజన్య

జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో

ఉత్సాహభరితంగా కొనసాగుతున్న క్రీడలు

బుద్వేల్, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బంది క్రీడలు రెండవ రోజు మంగళవారం ఉత్సాహభరితంగా జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుండి విశ్వవిద్యాలయ బోధన సిబ్బంది ఈ పోటీలలో పాల్గొని క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో వారి ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో బాల్ బ్యాడ్మింటన్ లో రాజేంద్రనగర్ జోన్ విజయం సాధించింది. ఉత్తర తెలంగాణ జోన్ రెండవ స్థానాన్ని దక్కించుకుంది. క్రికెట్ ఫైనల్ లో హోరాహోరీగా జరిగిన మ్యాచ్ లో మధ్య తెలంగాణ జోన్ విజయం సాధించింది. రాజేంద్రనగర్ జోన్ రెండో స్థానంలో నిలిచింది. వాలీబాల్ క్రీడలో ఉత్తర తెలంగాణ మరియు దక్షిణ తెలంగాణ జోన్లు ఫైనల్ కు చేరుకున్నాయి. క్విజ్ లో సెంట్రల్ తెలంగాణ జోన్ కు చెందిన సల్లా సౌజన్య ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. సాంస్కృతిక మరియు సాహిత్య రంగాలలో పోటీలు కొనసాగుతున్నాయి . ఈ పోటీలు రేపటితో ముగియనున్నాయి.

వాలీ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

క్రికెట్ క్రీడాకారులు

క్రీడలలో పాల్గొంటున్న సెంట్రల్ తెలంగాణ జోన్ క్రీడాకారులు

నడిగడ్డ ఇలవేల్పు జమ్ములమ్మను దర్శించుకున్న
వేలాది భక్తులు

భక్తుల జనసంద్రంతో జమ్ములమ్మ ఆలయం

అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

కొలువుదీరిన జములమ్మ

అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం)నడిగడ్డ ఇలవేల్పు భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని శ్రీజమ్ములమ్మ పరుశరామ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మాఘ శుద్ధ పౌర్ణమికి జాతర ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున నుంచే భక్తులు వేలాదిమంది తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని భక్తులు పరవశించారు. జములమ్మ తల్లీ కరుణించవమ్మా.. కాపాడవమ్మా అంటూ మహిళల నామస్మరణ, పూనకాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. ఉమ్మడి పాలమూరు జిల్లా, కర్ణాటక, బెంగుళూరు, ముంబాయి,కర్నూల్, ఆంధ్ర, మొదలగు ప్రాంతాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ గదులతో పాటు పరిసరాలలో షామియాలను వేసుకొని నైవేద్యాన్ని సిద్ధం చేసుకొని అమ్మవారికి సమర్పించారు. చీర, రవికతో పాటు వెండి పాదాలు, కడియాలు, బియ్యాన్ని అమ్మవారికి అర్పించి, మొక్కులు తీర్చుకున్నా రు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉచిత సర్వ దర్శనంతో పాటు రెండు ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. అమ్మవారి సన్నిధిలో కూర్చోవడానికి చలువ పందిర్లను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే వేల కొద్ది భక్తులు తరలిరావడంతో అమ్మవారి దర్శనానికి గంటలు తరబడి క్యూలైన్లో నిలబడి దర్శించుకున్నారు. ఆలయ ముఖద్వారం నుంచి ఆలయం వరలు ఇసుకేస్తే కనపడనంతా భక్తజనం కనపడింది.

మరో మేడారంగా మారిన శ్రీజమ్ములమ్మ ఆలయం

గద్వాల పట్టణంలో గల స్వయంభుగా వెలసిన శ్రీజములమ్మ పరుశరాముడి ఆలయానికి లక్షలాది మంది తరలివచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకుంటారు. తెలంగాణలో సమ్మక్క సారక్క జాతర మాదిరిగానే జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల పట్టణంలో శ్రీజములమ్మ జాతరను ఆరునెలల పాటు ప్రతి మంగళ, శు క్రవారాలలో బ్రహ్మాండంగా నిర్వహిస్తారు. తెలంగాణ, కర్ణాటక ,మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వివిధ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని నైవేద్యం సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించుకుంటారు. ప్రతి మంగళ, శుక్రవారాలలో శ్రీజమ్ములమ్మ ఆలయ పరిసరాలు భక్తుల కిక్కిరిసిపోవడంతో మరో మేడారం జాతరను తలపిస్తోందని ఆలయ చైర్మన్ గాయిత్రి సతీష్, ఆలయ ఇఓ పురేందర్ అన్నారు.

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం
కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ పండాల

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం) ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. మంగళవారం ఫతే నగర్ డివిజన్ పరిధిలోని శోభన కాలనీ మార్కెట్లో ఉన్న అరబ్ షా బాబా దర్గాకు రూ. 30 లక్షల వ్యయంతో కాంపౌండ్ వాల్ పనులను ప్రారంభించి పూర్తిగా నిర్మించినందున అరబ్ షా బాబా దర్గా కమిటీ సభ్యులందరూ కలిసి ఫతే నగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ను కలిసి సన్మానించారు. ఇంత అద్భుతమైన పనిని ఇంతవరకు చరిత్రలో ఎపుడు చేయలేదు అలాగే రూ.70 లక్షల వ్యయంతో నాల రిటర్నింగ్ వర్క్స్ పనులను కూకట్ పల్లి శాసన సభ్యులు మాధవరం కృష్ణ రావు సహకారంతో పూర్తిచేయడంతో కార్పొరేటర్ ధన్యవాదాలు తెలుపుతూ ఇంకా కొన్ని పార్కింగ్ టైల్స్, చిన్న చిన్న వాల్స్ పనులు కూడా నిర్మించడం పూర్తి చేస్తే మాకు శాశ్వత పరిష్కారం అవుతుందని కమిటీ వారు ఆయనకు తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ సానుకూలంగా స్పందించి అతిత్వరలో అంచనాలు వేయించి పనులను పూర్తి చేస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ సలావుద్దీన్, మొహమ్మద్ నషు ఖాన్ ,షేక్ సమధ్, అబ్దుల్ రజాక్, ఇక్ర మొదిన్, హఫీజ్ వసీల్ , మొహమ్మద్ రియాజ్ , ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

హజ్ యాత్రకు వెళ్తున్న బల్కిశాకు వీడుకోలు పలికిన కొత్తకోట మండల నాయకులు

హజ్ వెళ్తున్న బల్కిశా ను సన్మానించిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మూలమల్ల రాజేశ్వరి భీమ్ రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలంలోని రామకృష్ణాపురం గ్రామ మాజీ సర్పంచ్ స్వర్గీయ ఎం ఎ కరీం మేనకోడలు బిల్కిశా ను మదనాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మూలమల్ల రాజేశ్వరమ్మ భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మూలమల్ల సత్య నారా యణ రెడ్డి, గ్రామ బి ఆర్ ఎస్ అధ్యక్షులు ఎం యుగంధర్ రెడ్డి, ఎం సరస్వతమ్మ, బి ఆర్ ఎస్ నాయకులు వహీద్, నిరంజన్, ఖలీల్,వాజిద్, సలీం తదితరులు ఉన్నారు.

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎంపీపీ మౌనిక
స్థానిక సంస్థల ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డికి బిఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని స్వామివారికి పూజలు చేసిన ఎంపీపీ

తిరుమల వెంకన్నను దర్శించుకున్న కొత్తకోట మండల ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్

కొత్తకోట, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం) దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డికి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ టికెట్ ను బి ఆర్ ఎస్ అధినేత కేసిఆర్ ఇవ్వాలని కలియుగ దైవం వెంకటేశ్వర స్వామికి కొత్తకోట మండల ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్ పూజలు చేశారు . కలియుగ వైకుంఠమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో సాక్షాత్తు కొలువై ఉన్న ఆ మహా విష్ణువు స్వరూపమైన వెంకటేశ్వర స్వామిని ప్రజల కోసం నిత్యం పనిచేస్తున్న వెంకటేశ్వర్ రెడ్డికి ప్రజాక్షేత్రంలో ఉండాలని కోరుతూ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయ ముందున్న దివ్య జ్యోతి ప్రజ్వలన స్తూపం దగ్గర 51 దీపాలను వెలిగించి మొక్కు తీర్చుకున్నారు. అక్కడ దగ్గరే ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయంలో 51 ప్రదక్షిణలు చేసి 51 టెంకాయలు కొట్టి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్న. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ టికెట్ ఇవ్వడంతో పాటు భారీ విజయం సాధించాలని కోరుకుంటున్నారు. తెలంగాణ ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ , మాజీ మంత్రి కేటీఆర్ టికెట్ ఇస్తారని ఆశాభావంతో ప్రార్థించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని గుంత మౌనిక మల్లేష్ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు.

జమ్ములమ్మ ఆలయం వద్ద అడుగడుగునా నిలువు దోపిడి
నాసిరకం నూనెలతో అనారోగ్యానికి గురవుతున్నా భక్తులు
కల్తీ కల్లు తాగి వాంతులు, విరోచనాలు

గద్వాలటౌన్, ఫిబ్రవరి27(ప్రభాత ఉదయం)గద్వాల పట్టణ సమీపంలో గల శ్రీజమ్ములమ్మ ఆలయానికి మంగళవారమ భక్తుల తాకిడి పోటెత్తింది. ఆలయ పరిసరాలలో ఆలయ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించలేదని భక్తులు మండిపడ్డారు. ఆలయ పరిసరాలలో అడుగడుగున్నా భక్తులను నిలువుదోపిడికి గురి చేస్తున్నారని భక్తులు అమ్మవారిని దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టు స్థలం వద్ద నిర్వాహకులు అడ్డంకులు సృష్టించి కొబ్బరి కాయలు కొట్టనివడం లేదని భక్తులు ఆరోపించారు. తలనీలాలు సమర్పించేందుకు టికెట్ రూ.10 ఉండగా ఒక్కొక్కరి నుంచి రూ.100-300 వరకు ఇష్టానుసారంగా వసూలు చేసినట్లు భక్తులు ఆరోపించారు. ప్రత్యేక తలనీలాలు (పుట్టు వెంట్రుకలు) పేరిట రూ. 500-1000 వరకు వసూలు చేస్తున్నారని ఇదేమిటని ప్రశ్నిస్తే అంతా మా ఇష్టం అన్నట్లు వ్యవహరిస్తున్నారని భక్తులు వాపోయారు. అధిక వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవలసిన ఆలయ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు భక్తులు ఆరోపించారు.

నాసిరకం కల్లు...నాణ్యత లేని పుడ్

జమ్ములమ్మ ఆలయ సమీపంలో వెలసిన కల్లు దుకాణాలలో నాసిరకం (కల్తీ) కల్లు అమ్ముతున్నారని, కల్లు సేవించిన వారికి వాంతులు విరోచనాలకు గురయ్యారని బాధితులు పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా జమ్ములమ్మ జాతర అంటే ముఖ్యంగా మాంసహారంతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, బంధు మిత్రులతో భోజనం చేస్తారు. జాతరలో మటన్, చికెన్, కాల్చిన కూర దుకాణాలు పెద్ద ఎత్తున్న వెలిశాయి. నాసిరకమైన నూనెలు వాడటంతో వినియోగదారులు అనారోగ్యానికి గురవుతున్నారు. కర్రిస్ చేయడానికి వాడిన నూనెలు మళ్ళీ మళ్ళీ వాడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతే గాకుండా జాతరకు వచ్చిన భక్తులకు సద్ధి మటన్, చికెన్ లకు కారం,మసాలాలు వేసి కాల్చడంతో అది తిన్నవారు అనారోగ్యానికి గురవుతున్నారు. జమ్ములమ్మ పరిసర ప్రాంతాలలోని హోటళ్లపై అధికారుల పర్యవేక్షణ కరువైందని నాసిరకం వంట నూనెలు, నాసిరకం మాంసహారం వాడుతున్న పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జమ్ములమ్మ ఆలయం వద్ద నిలువుదోపిడిని అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

జమ్ములమ్మ అమ్మవారి ముఖద్వారం

వేములవాడ రాజన్న ఆలయ కమిటీ కి చెక్కు అందజేత

వేములవాడ రాజన్న ఆలయంలో నిత్యాన్నదానానికి 1,00,111 విరాళం
తన ఔన్నత్యాన్ని చాటుకున్న పుప్పాల అజయ్ కుమార్

కూకట్‌పల్లి,ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం) పాతబస్తీ ఛత్రినాక నివాసంలో ఉండే పుప్పాల అజయ్ కుమార్, పుప్పాల ఆదర్శ్ కుమార్ లు ప్రతి సంవత్సరం ఒక ఆలయానికి తమకు తోచిన విరాళాన్ని అందిస్తూ భగవంతుని మీద ఉన్న వారి భక్తిని చాటుతున్నారు. మంగళవారం సిరిసిల్ల జిల్లా వేములవాడ లో గల శ్రీ రాజరాజేశ్వర ఆలయానికి నిత్యాన్నదాన కార్యక్ర మానికి పాతబస్తీ చత్రినాక నివాసి పుప్పాల అజయ్ కుమార్, పుప్పాల ఆదర్శ కుమార్ రూ. 1,00,111 విరాళాన్ని అందించి భక్తులపై ఉన్న తన ఉధారతను చాటారు. దేశంలో ప్రసిద్ధిగాంచిన పలు ఆలయాలకు ఇదే తరహా తన దాతృత్వాన్ని ఆవిష్కరించి స్వామివారి కరుణ కటాక్షం పొందారు. అనంతరం ఆలయ అర్చకులు రాజమౌళి, సెక్షన్ ఆఫీసర్ తిరుపతి నాయక్ పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి స్వామివారి కృపా కటాక్షాలు వారి కుటుంబం పై ఉంటూ మరిన్ని ఆలయాల అభివృద్ధికి పాటుపడాలని వారిని దీవించారు.

చేవెళ్ల సభకు తరలి వెళ్తున్న శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్

రాష్ట్ర అభివృదే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం
రానున్న ఎంపీ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ జెండా ఎగురేస్తాం
వి.జగదీశ్వర్ గౌడ్,శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్..

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 27 (ప్రభాత ఉదయం) చేవెళ్ల ఫర్హా కాలేజ్ మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలలో భాగంగా మరో రెండు ఉచిత పథకాలు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ పథకాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం చేయనున్న శుభ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన చేవెళ్ల సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ... చేవెళ్ల గడ్డ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా రెండు పథకాలను ప్రారంబించడం మనకు గర్వకారణమన్నారు. రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంటు,ఆర్టీసీలో ఉచిత ప్రయాణం,ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల వైద్యసేవలు వంటి పథకాలు పేదల జీవితాల్లో ఆర్థిక వెసులుబాటును కల్పిస్తామని అన్నారు. ఈ పథకాలను ప్రజల్లోకి కార్యకర్తలు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం వచ్చాక మొదటి సారిగా మన సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నందున ఈ సభకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా కదిలి వెళ్లడం జరుగుతుందని, ఈ పథకాలు ఎక్కువగా మహిళల గురించే ఉన్నాయని, ఈ సభకు మహిళలను పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, ఎన్నికల్లో బీజేపీతోనే మనకు పోటీ ఉంటుందని, ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మన జిల్లాలో అడ్రెస్ ఉండదని అన్నారు. బీఆర్ఎస్ ఉన్న నాయకులు,కార్యకర్తలు కాంగ్రెసులోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, ఎన్.ఎస్.యూ.ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హెూమం చేస్తున్న శివ స్వాములు

కోటిలింగేశ్వరస్వామి సన్నిధిలో శివధీక్ష స్వాములచే రుద్రహెూమం

కొత్తకోట, ఫిబ్రవరి 27(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శ్రీకోటిలింగేశ్వరదత్త ఆలయంలో మంగళవారం రుద్ర హెూమం మంగళ శివధీక్ష స్వాముల ఆధ్వర్యంలో రుద్రహెూమం జరిగింది. నలభై ఒక్క రోజుల పాటు శివమాలను ధరించిన శివస్వాముల చేత అర్చకులు వేదమంత్రాలతో రుద్రపఠనం చేస్తూ రుద్రహెూమం జరిపించారు. అనంతరం ఆలయకమిటి శివస్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.